నిరాశాజనకంగా నిర్మలమ్మ బడ్జెట్

- కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి డిమాండ్

కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశా జనకంగా ఉందని ఇది ఏమాత్రం ప్రజల బడ్జెట్ కాదని కార్పొరేట్లకు అనుకూల బడ్జెట్ గా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి బైరాగి పట్టెడలోని శ్రీ గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి మెమోరీయల్ హాలు నందు సిపిఐ జిల్లా సమితి సమావేశం కత్తి రవి అధ్యక్షతన జరిగింది.

వార్త మెయిన్‌లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

బుధవారం 24 జులై 2024 | 8 పేజీలు

ఏపీకి ఇచ్చేది గ్రాంటా..? అప్పా..? తేల్చండి

విభజన హామీలు ఎందుకు అమలు చేయలేదు

కార్మిక రైతాంగానికి మొండి చేయి చూపించారు : సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

విశాలాంధ్ర-తిరుపతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులపై తిరుపతి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి స్పందించారు. ఏపీ రాజధాని నిర్మాణానికి నేరుగా సాయం అందిస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పకపోవడం శోచనీయ మన్నారు. మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా రూ.15 వేల కోట్ల ఆర్థిక మద్దతు అంది స్తామని కేంద్ర మంత్రి పేర్కొనడం గమనార్హమని అన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు గ్రాంటా? లేక అప్పా? అనేది తేల్చాలని డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితు ల్లోనూ అప్పు భారాన్ని మోప వద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గ్రాంట్ రూపంలోనే ఇవ్వాలని ఆయన కోరారు. పోలవరాన్ని పూర్తి చేస్తామని పదేళ్లుగా కేంద్రం చెబుతోందని,

2

ఎన్టీఆర్ వైద్య సేవలను

విస్తృతం చేయండి

- చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు : చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రి లో ఎన్టీఆర్ వైద్య సేవలను విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేశారు. జిల్లా ప్రధాన ఆస్ప త్రిలో డయాలసిస్, ఎక్స్‌రే, క్యాజువాలిటీ, ఓపి వార్డు, పీడియా ట్రిక్, గైనిక్, లేబర్ వార్డులను పరిశీలించారు. అనం తరం జిల్లా కలెక్టర్ విలేఖరులతో మాట్లాడుతూ. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలలో

2

పాన్పుపై పారిశుద్ధ్యం...?!

- రెండన్నరేళ్లుగా వాడని పరికరాలు
- లక్షలు వెచ్చించినా ప్రభుత్వ లక్ష్యం గాలికి - నిద్రావస్థలో పర్యవేక్షణ

విశాలాంధ్ర-వెదురుకుప్పం: గ్రామీణ ప్రజా ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య చర్యలలో భాగంగా పరికరాలు కొనుగోలు చేసి ప్రభుత్వం గ్రామ పంచాయతీ లకు అందించింది.అయితే పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో ఆ పరికరాలు రెండున్నర ఏళ్లుగా వాడుకలోకి తీసుకురాక మూలన పడ్డాయి. అసలేం జరిగిందంటే......మండలంలో 25 గ్రామ పంచాయతీలు, 222గ్రామాలు ఉన్నాయి.

2

అధికారం శాశ్వతం కాదు...

మీ ప్రేమాభిమానాలు శాశ్వతం

- నారా భువనేశ్వరి

విశాలాంధ్ర - కుప్పం: అధికారం శాశ్వతం కాదు, అది కారం ఉందని, మీరు చంద్రబాబుకు ముఖ్యమంత్రి అయ్యేందుకు సహకరించారని ఇక్కడకు నేను రాలేదు. మా కుటుంబంపై మీరు 40ఏళ్లుగా చూపిస్తున్న ప్రేమాభి మానాలకు ప్రతిఫలంగా మీకు ఏదోఒకటి చేయాలనే ఉద్దేశంతో

2

జేసి ధ్యాన చంద్ర, కమిషనర్ అదితిసింగ్ సేవలు ఎనలేనివి: కలెక్టర్

విశాలాంధ్ర-తిరుపతి: జేసిగా పని చేసి విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా వెళ్తున్న ధ్యాన చంద్ర మరియు కడప జిల్లా జెసి గా బదిలీపై వెళ్తున్న మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ చేసిన సేవలు అమూల్యమైనవి అని, సమర్థవంతమైన అధికారులు అని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ మరియు పలువురు అధికారులు కొనియాడారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో విజయ వాడ మున్సి పల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న జెసి ధ్యాన చంద్ర, కడప జెసి గా బదిలీపై వెళ్తున్న అదితి సింగ్ కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లిష్టమైన తిరుపతి జిల్లా ఎన్నికల నిర్వహణ సమయంలో ధ్యాన చంద్ర, అదితి సింగ్ ఉన్నారని వారు సమర్థవంతంగా నిర్వహించారని, జెసిగా ధ్యాన చంద్ర సేవలు ఎనలేని వని, ఎంతో బాధ్యతగా నిర్వహిస్తారని తెలిపారు. తాను తనదైన శైలిలో చక్కటి నిర్ణయాలు తీసుకుని, క్షుణ్ణంగా సబ్జెక్ట్ అవగాహనతో విధులు అంకిత భావంతో పనిచేస్తారని తెలిపారు. యువ అధికారిగా, చురుకుగా ఎన్నికలలో రిటర్నింగ్ అధికారిగా చక్కగా బాధ్యతలు నిర్వర్తిం చారని కొనియాడారు.

2లో

ఏపీకి ఇచ్చేది గ్రాంటా..? అప్పా..? తేల్చండి

(మొదటి పేజీ తరువాయి) పోలవరానికి నిధులిస్తున్న పాపాన పోలేదని ఆయన విమర్శించారు. పోలవరాన్ని నిర్దేశిత సమయంలోపు పూర్తి చేస్తామని ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం చెప్పలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ విభజన సమస్యల పరిష్కారానికి పదేళ్లుగా 10 సంవత్సరాలుగా సిపిఐ పోరాడుతోందని ఆయన గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్రం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. పదేళ్లుగా రాష్ట్రానికి ఆర్థికంగా ఫెసిలేట్ ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు. అలాగే వెనుకబడిన జిల్లాలకు ఎంత మేరకు సాయం చేస్తారనే విషయమై స్పష్టత లేదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో పోలవరానికి అవసరమైన నిధులు ఇస్తామన్నారే తప్ప, ఎంత ఇస్తారనే దానిపై కేంద్ర ఆర్థిక మంత్రి క్లారిటీ ఇవ్వలేదన్నారు. ఏపీతో పోలిస్తే బీహార్ రాష్ట్రానికి అత్యధిక ప్రాజెక్టులు ఇచ్చారన్నారు. ఏపీకి అన్యాయం జరిగిందని కార్మిక రైతాంగానికి ఎందుకు బడ్జెట్ కేటాయించలేదని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ ఎందుకు కేటాయించలేదని ఆరోపించారు.

పాన్పుపై పారిశుధ్యం...?!

(మొదటి పేజీ తరువాయి) ఈ క్రమంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో 2021 సంవత్సరం లో గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల పరిశుభ్రత కోసం హై ప్లేసర్ టాయిలెట్ క్లినర్ లు 17 గ్రామ పంచాయతీ లకు,అలాగే గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ మిషన్ లు ప్రభుత్వం 23 గ్రామ పంచాయతీ లకు అందించింది.అయితే ఒకటి రెండు పంచాయతీ లు మినహా మిగతా చోట్ల కనీసం పరికరాల.పార్సెల్ ఓపెన్ కూడా చెయ్యలేదు.మరి కొన్ని పంచాయితీ ల్లో పరికరాలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కనబడడం లేదని సమాచారం.అంటే వాడుకలోకి తీసుకురాకనే పక్కదారి పట్టించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.లక్షలు ఖర్చు చేసిన పారిశుధ్య పరికరాలు సంవత్సరాలు తరబడి వాడుకలోకి తీసుకురాకపోవడం పంచాయితీ పారిశుధ్యం చర్యలు ఏపాటి జరిగాయో అర్థం చేసుకోవచ్చు. ఇదే విషయమై పంచాయతీ విస్తరణ అధికారి పురుషోత్తం వివరణ కోరగా గ్రామ పంచాయతీ ల్లో పర్యవేక్షణ చేసి పరికరాలు వాడుకలోకి తీసుకోస్తాం.క్షేత్ర స్థాయిలో నిర్లక్ష్యం చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జేసి ధ్యాన చంద్ర, కమిషనర్ అదితిసింగ్ సేవలు ఎనలేనివి

(మొదటి పేజీ తరువాయి) అదితి చక్కగా క్లిష్టమైన తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల బాధ్యతలు నిర్వహిం చారని తెలిపారు. అదితి సింగ్, ధ్యాన చంద్ర ఇరువురికి అంతా మంచే జరగా లని కోరుకున్నారు. బదిలీపై వెళ్తున్న ధ్యాన చంద్ర మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సమయంలో తాను రావడం జరిగిందనీ, రిటర్నింగ్ అధికారిగా ఒక ఛాలెంజ్‌గా తీసుకుని జాగ్రత్తగా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. తిరుపతి జిల్లా వంటి క్లిష్టమైన సార్వత్రిక ఎన్నికలను సమర్థవం తంగా నిర్వహించడానికి సహకరించిన అందరు జిల్లా, డివిజన్, మండల, బూత్ లెవెల్ స్థాయి వరకు అధికారులు, సిబ్బందికి, మీడియా వారికి అందరికీ తన కృతజ్ఞతలు తెలిపారు. అందరూ టీమ్‌వర్క్‌గా పని చేస్తే సత్ఫలితాలు ఉంటాయని తెలిపారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి జిల్లాలో పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. గతంలో మరియు ప్రస్తుత కలెక్టర్లకు తన ధన్యవాదాలు తెలిపారు. అదితి సింగ్ మాట్లాడుతూ తాను పలు మంచి అంశాలపై వారిని చూసి నేర్చుకోవడం జరిగిందని, ఎన్నికల నిర్వహణలో గైడెన్స్ తీసుకోవడం జరిగిం దని వారికి అంతా మంచే జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ వెంకటగిరి రిటర్నింగ్ అధికారిగా సమర్థవం తంగా ప్రణాళికా బద్ధంగా పనిచేస్తూ, అలాగే జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు 2024 నిర్వహణలో చాలా కీలకంగా ఎప్పటికప్పుడు అధికారులకు పలు సూచనలు చేస్తూ మార్గదర్శనం చేశారని కొనియాడారు. ఆర్డీఓ లు కిరణ్ కుమార్, చంద్రముని, నిషాంత్ రెడ్డి, రవి శంకర్ రెడ్డి పలువురు అధికారులు మాట్లాడుతూ బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అమలు చేస్తూ, ఆర్‌ఓగా వెంకటగిరి ఎన్నికల్లో విధులు నిర్వర్తిస్తూ, జిల్లాలో ఎన్నికల నిర్వహణలో ఎప్పటికప్పుడు అధికారు లను అప్రమత్తం చేస్తూ ఎంతో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కృషి చేశారని ఎంతో సమర్థవంతమైన అధికారి అని కొనియాడారు. అలాగే వారు ముందు ముందు మంచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ధ్యాన చంద్ర, అదితి సింగ్ కు పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు పలువురు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్డీఓలు, ఎస్డీసిలు, మండల తహశీల్దార్లు, ఎంపిడిఓలు పలువురు పాల్గొన్నారు.

విస్తృతం చేయండి

(మొదటి పేజీ తరువాయి) భాగంగా ఎంసిహెచ్, రేడియాలజీ విభాగాలను పరిశీలించడం జరిగిందన్నారు. రేడియాలజీ ద్వారా ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ మరియు డయాలసిస్ ద్వారా రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో నూతనంగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, అపోలో సిబ్బంది ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతున్నదని, దీనిని మరింత మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజూ అధిక సంఖ్యలో రోగులు రావడం జరుగుతున్నదని తెలిపారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు, ఆసుపత్రిలో కనీస మౌలిక వసతుల ఏర్పాటు, భోజన వసతి, పారిశుద్ధ్యం, ప్రభుత్వం నుండి అందాల్సిన ఆర్థిక సహాయం తదితర అంశాలపై ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, అపోలో సిబ్బందితో సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన ఆస్పత్రి లో రోజుకు 1500 ఓపి కేసులు రావడం జరుగుతున్నదని, యూరాలజీ, న్యూరో సర్జరీ సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా అందించడం జరుగు తున్నదని, డయాలసిస్ సేవలకు సంబంధించి రోజుకు 48 మందికి నాలుగు షిఫ్ట్‌లలో సేవలు అందించడం జరుగు తున్నదని మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ అరుణ్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట అపోలో సిసిఓ నరేష్ కుమార్ రెడ్డి, అపోలో మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ రంగ నాథ్, డా. సంధ్య, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మీ ప్రేమాభిమానాలు శాశ్వతం

(మొదటి పేజీ తరువాయి) నేను మీ ముందుకు వచ్చాను అని కుప్పం నియోజకవర్గం, కమ్మగుట్టపల్లి గ్రామ మహిళలతో ముఖ్య మంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం నియోజకవ ర్గంలో పర్యటన సంద ర్భంగా గుడిపల్లి మండలం, కమ్మగు ట్టపల్లి గ్రామ మహిళలతో భువనేశ్వరి ముఖాముఖి నిర్వహిం చారు. 2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చేందుకు కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు, ఓటరుకు భువనేశ్వరి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ వై నాట్ 175 అన్నవాళ్లకు రాష్ట్ర ప్రజలు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని, అరాచకాలు, దౌర్జన్యాలతో అధికారాన్ని చేజిక్కించుకోవాల నుకున్న వారికి ప్రజలు మౌనంగా ఓటుతో సమాధానం చెప్పా రు. ప్రజాస్వామ్య దేశంలో ఎప్పటికీ సత్యం, ధర్మం, నిజాయితీ, నిజమే గెలుస్తుందని రాష్ట్ర ప్రజలు 2024 ఎన్నికల్లో రుజువు చేశారు. కుప్పం ప్రజలు తమపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా, ఎంత వేధించినా, ఎంత భయపెట్టినా ఎవరికీ తలొగ్గకుండా ధైర్యంగా నిలబడి టీడీపీ జెండాను ఎగరేశారు. చంద్రబాబును 53రోజులు జైల్లో నిర్బంధించినప్పుడు కుప్పం మహిళలు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళలు చంద్రబాబుకు అండగా నిలబడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు చూపించిన చొరవ నాలో కదలిక తీసుకొచ్చింది. ఆ ధైర్యంతోనే నేను నిజం గెలవాలి కార్యక్రమాన్ని నిర్వహించాను. రాష్ట్రవ్యాప్తంగా పర్య టించాను. ఆ పర్యటనలో చంద్రబాబుపై మహిళలకు ఉన్న అభిమానం, ఆప్యాయత తెలుసుకున్నాను. నేను నిజం గెల వాలి కార్యక్రమం ద్వారా కుప్పం వచ్చినప్పుడు ఇక్కడి మహి ళలు నన్ను ఓ ఆడపడుచులా ఆదరించారు. ఆ సమ యంలో వాళ్లు చూపించిన ప్రేమాభిమానాలే నన్ను మరోసారి ఇక్కడికి తీసుకొచ్చాయి. చంద్రబాబుతో పనిలేకుం డా ప్రతి రెండు, మూడు నెలలకు నేను కుప్పం వస్తాను. కుప్పం ప్రజలకు ఉన్న సమస్యలు తెలుసుకుంటాను. వాళ్లకు నేను చేయగలిగిన సాయం చేస్తాను. ఎన్నికల ప్రచారం సమయంలో నేను చెప్పిన విధంగా కుప్పం నియోజకవర్గానికి 3 పెద్ద పరిశ్రమలు తెచ్చి, ఇక్కడి యువతకు ఇక్కడే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వచ్చేలా చంద్రబాబును ఒప్పిస్తాను. చంద్రబాబు కూడా ఎన్నికల సమయంలో కుప్పం నియోజకవర్గానికి ఇచ్చిన ప్రత్యేక మ్యానిఫెస్టో అమలుకు కట్టుబడి ఉన్నారు. ఇచ్చిన హామీలకు మించి కుప్పం ప్రజలకు మేలు చేస్తారు. నారా లోకేష్ కుప్పం గడ్డ మీద నుండి పాదయాత్ర ప్రారంభించారు. ఆ సమయంలో మీరు ఇచ్చిన ధైర్యం, చూపిన అభిమానంతో లోకేష్ తన పాదయాత్రను ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిలబడి, పోరాడి విజయవంతంగా పూర్తిచేశారు. కుప్పంలో అభివృద్ధి కార్యక్రమాలకు చంద్రబాబు అధికారులతో ఎప్ప టికప్పుడు సమీక్షలు నిర్వహి స్తున్నారు. నావంతు నేను కూడా కుప్పం ప్రజలకు చేతనైన సహా య,సహకారాలు అందిస్తాను. కుప్పం ప్రజలకు నేను, నా కుటు ంబం అన్ని వేళలా అందు బా టులో ఉంటామని మాట ఇసు ్తన్నాను అని భువనేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా మహిళలు తమకు ఉన్న సమస్యల ను భువనేశ్వరికి వివరిం చారు. అధికారులతో మాట్లాడి మీకు న్యాయం చేపిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ పాలనలో పేదవారి భూములు కబ్జాకు గురయ్యాయి. ఇలాంటి వారందరికీ ప్రత్యేక కోర్టుల ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కంకణబద్ధులై ఉన్నారు. ధైర్యంగా ఉండండి న్యాయం జరుగుతుంది అని అన్నారు.

నియోజకవర్గం లోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తా

కుప్పం నాలుగు రోజుల పర్యటనకు విచ్చేసిన విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడుసతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరికి గజమాలతో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పసుపు చీరలు కట్టుకుని హారతులు ఇచ్చి వెంకటాపురం శోలిశెట్టిపల్లి, 64–పెద్దూరు, గసిరపల్లి గ్రామ మహిళలు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించి విద్యార్థులకు చాక్లెట్లు అందించి, వారితో సరదాగా గడిపారు. కుప్పంలో చంద్రబాబు ని భారీ మెజారిటీ తో గెలిపించిన ప్రతిఒక్కరికి నారా భువనేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. కమ్మగుట్టపల్లి గ్రామమలో మహిళలతో ముఖముకి లో పాల్గొన్నారు. రాష్ట్రంలో జరిగిన అకృత్యలకు, దౌర్జన్యలను చుసిన మహిళలు కసితో టీడీపీ కి ఓటేసి గెలిపించారు . అలాంటి మహిళలకు ఏమిచ్చిన ఋణం తీర్చుకోలేమని నారా భువనేశ్వరి అన్నారు. ప్రతిఒక్క మహిల కు అండగా ఉండి స్వశక్తి తో ఎదిగేలా అన్నివిధాలా ఉపాధి కల్పన కల్పించేలా చర్యలు తీసుకుంటాం, నిరుద్యో గులు బయట ప్రాంతాలకు ఉద్యోగం కోసం వెళ్లకుండా కుప్పంలోనే పరిశ్రమలు తీసుకోచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూడటమే కాకుండా వారు పదిమందికి ఉపాధి కల్పించేలా స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం చెప్పడతాం, గత ప్రభుత్వంలో భూములు అన్యాక్రాంతం అయ్యాయి భూ సమస్యలు సత్వర పరిస్కారం చేపిస్తాం అని, నియోజక ్వర్గం లోని ప్రతి ఒక్కరు తన బిడ్డలాంటి వారని వారి ఎదుగుదల కోసం ఎంతవరకైనా పోరాడాతనని హామీ ఇచ్చారు. దత్తత తీసుకున్న రెండు గ్రామాలతో పాటు నియోజకవర్గం లోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేపిస్తా అని, ముఖ్యమంత్రి తో కొట్లాడి ఆయన నియోజకవర్గం లో కనివిని ఎరుగని రితిలో అభివృద్ధి చేసి చూపిస్తా అని నారా భువనేశ్వరి అన్నారు.

స్కీం వర్కర్ల పై రాజకీయ వేధింపులు మానాలి

విశాలాంధ్ర - పలమనేరు :రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు మానాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు డివి మునిరత్నం, పార్థసారథి పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంగళవారం పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయం నందు శివన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి స్కీం వర్కర్లైన అంగన్వాడీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, సంఘ మిత్రులు, మున్సిపల్ వర్కర్లు ప్రభుత్వాలు చేపడుతున్న, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అందించడంలో అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. అటువంటి వారిపై రాజకీయ కక్షలు, పనుల నుండి తొలగించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఐదు సంవత్సరాలకు ఓసారి ప్రభుత్వాలు మారినప్పుడు ఇలాంటి తొలగింపు కార్యక్రమాలకు పూనుకోవడం భావ్యం కాదని, వర్కర్లు పొరపాటు చేసినప్పుడు వారితో చర్చించి తప్పు తేలినప్పుడు ఒకసారి అవకాశమిచ్చి తప్పులు దొరల కుండా చూడాల్సింది ఎంతైనా ఉందన్నారు. నాయకులు తప్పుల మీద తప్పులు చేసినప్పుడు ప్రజలు ఏ రోజు మిమ్మలను తొలగించే కార్యక్రమం చేయలేదనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. అదేవిధంగా వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు, ప్రోత్సాహకం, కల్పిస్తూ రాజకీయ వేధిం పులు మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మనీ , సరస్వతి, గంగిరెడ్డి, సాంబశివ, బాబు, జనార్ధన్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా మా కక్షిదారుడైన **శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెండ్** బ్రాంచ్ మేనేజర్, తిరుపతి బ్రాంచ్ వారి సూచనలమేరకు ఇచ్చిన బోగట్టా ప్రకారం చిత్తూరు జిల్లా, గౌడుగుమానిపల్లి గ్రామం, గుడ్యానంపల్లి పోస్ట్, పెనుమూరు మండలంలో కాపురముండు శ్రీమతి సులోచన, భర్త సి.లోకేష్‌కి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి లింక్ డాక్యుమెంట్స్ నెం. 3198/2021 తేది 24-09-2021 స్థిరాస్తికి సంబంధించిన లింక్ డ్యాకుమెంట్స్ దారిపోయినవి. సదరు డాక్యుమెంట్స్ ఎంత వెతికిననూ దొరకలేదు. సదరు డాక్యుమెంట్స్ ద్వారా సి.లోకేష్ ఈ క్రింది షెడ్యూలుపై నకలు పత్రము ద్వారా లోన్ మంజూరు చేయుటలో ఎవ్వరికైననూ ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఏడు రోజులలోగా మీకు గల అభ్యంతరములను వ్రాతపూర్వకముగా తెలియపరచవలసినది. లేని ఎడల ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి లోను మంజూరు చేయబడును.

షెడ్యూలు : చిత్తూరు జిల్లా, చిత్తూరు రూరల్ జిల్లా, పెనుమూరు మండలం, పులికల్లు గ్రామ పంచాయితీ, రెవిన్యూ లెక్కదాఖలా గౌడుగుమానపల్లి గ్రామ కంటం, సర్వేనెం.88/1, డోర్ నెం. 5/55 గల ఇళ్ళు ఇందుకు గల హద్దులు తూర్పు:రాజా వీధి, పడమర : పి.రేణుకాపతి శెట్టి ఇళ్ళు, ఉత్తరం: సి.ఎం.గోవిందశెట్టి ఇళ్ళు, దక్షిణం: జి.చంద్రశేఖర్‌శెట్టి ఇళ్ళు, తూర్పు-పడమర: 40అ॥లు, ఉత్తరం -దక్షిణం : 47అ॥లు, వెరసి మొత్తం : 1880చ॥అ॥లు లేక 208.88 చ॥గ॥లు.

నగరం సునీల్ కుమార్,అడ్వకేట్,కుమ్మరితోపు,తిరుపతి

భారత్ బడ్జెట్ 3.0ని స్వాగతిస్తున్నాం

- బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరి మనోజ్ కుమార్

విశాలాంధ్ర - గూడూరు : భారత్ బడ్జెట్ 3.0ని స్వాగతిస్తున్నామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మొట్టమొదటి బడ్జెట్ దేశ ప్రజలు స్వాగతించే విధంగా ఉందన్నారు. అన్ని వర్గాలను, అన్ని రాష్ట్రాలను ఆదుకునే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఫైనాన్స్ మినిస్టర్ నిర్మల సీతారామన్ 2024 -25 భారత్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రజల కల రాజధాని నిర్మాణం కోసం స్పెషల్ సపోర్టింగ్ కింద కేంద్ర బడ్జెట్లో ఈ ఏడాదికి 15 వేల కోట్లు కేటాయించడం జగిందని పేర్కొన్నారు. అవస రాన్ని బట్టి మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్థిక శాఖ మంత్రి వర్యులు నిర్మల సీతారామన్ తెలిపారు అన్నారు. విశాఖ-చెన్నై, ఓర్వకల్లు- హైదరాబాద్ ఇండస్ట్రీ కారిడార్ల ఏర్పాటు,ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఎన్డీఏ ప్రభుత్వం కష్టపడుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజల తరపున ఎన్డీఏ ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

మండలంలో ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర - సత్యవేడు: సత్యవేడు మండ లంలో ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రాలు మంగళవారం ప్రారంభమ య్యాయి.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగానే తొలి రోజు మండలంలోని దాసుకుప్పం,ఇరుగులం సచివాలయంలో ఆధార్ నమోదు ప్రక్రియను చేపట్టారు.ఈ నేపథ్యంలో దాసుకుప్పం కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్ ప్రకాష్,శ్రీధర్ లు 21 మందికి ఆధార్ నమోదు చేయించారు.ఇందులో వేలిముద్రల నమోదు ఒకటి, మొబైల్ నెంబర్ అనుసంధానం ఒకటి,మిగిలినవి ఆధార్ కార్డు కొత్త నమోదు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.అలాగే ఇరుగులం కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్ బాలాజీ 23 మందికి ఆధార్ నమోదు చేయించడం జరిగింది.ఇందులో మొబైల్ అనుసంధానం,బయోమెట్రిక్,కొత్త ఆధార్ కార్డు నమోదు ఉన్నాయి.కాగా స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆధార్ కార్డు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నాయి.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలకు ఆధార్ నమోదు జరుగుతోంది.బుధవారం కూడా ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్ నమోదు కొనసాగనున్నాయి.ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు నిహారిక,శంకరమ్మ, పలువురు సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బంగారమ్మ ఆలయంలో పూజలు, అభిషేకాలు

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటి నగరంలోనే గ్రామదేవత శ్రీబంగారమ్మ ఆలయం లో మంగళవారం ఉదయం ప్రత్యేకఅభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భ ంగా వివిధ గ్రామాల నుండి భక్తులు మొక్కు బళ్ళు తీర్చుకున్నారు. భక్తులు పొంగ లు పెట్టి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలి, కార్యదర్శి చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

గుండె పోటుతో యువకుడు మృతి

విశాలాంధ్ర - రామచంద్రపురం: గుండె పోటుతో యువకుడు వి. హేమంత్ (31) మృతి చెందిన సంఘటన రేకల చేను గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని రేకల చేను గ్రామానికి చెందిన పచ్చార్ల హేమంత్ పొలం వద్దకు పొలం గట్టుపై వెళుతుండగా గుండె పోటు రావడంతో వరి పొలంలోని బురదలో పడిపోయాయి, బురదలో గుండె నొప్పికి కొట్టుమిట్టాడు. మృతుడు పడిపో యిన స్థలం ఊరికి వెలుపల భాగంలో ఉంది. ఎవరు గుర్తించలేదు. 10 గ్రామ శునకాలు మృతుడి హేమంత్ పడిపోయిన స్థలం వద్దకు వెళ్లి గట్టిగా అరవసాగాయి. దీంతో కొంత సమయానికి స్థానికులు గుర్తించి పొలంలో నుంచి హేమంత్ను బయటికి తీసుకొచ్చారు అప్పటికే ఎలాంటి నాడీ వ్యవస్థ పని చేయక పోవడంతో ప్రథమ చికిత్స చేశారు. 108కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు స్థానికులు విద్యుత్ షాక్ తో మృతి చెందాడేమోనని మొదట అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరి ప్రసాద్, రామచంద్ర పురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విద్యుత్ షాక్ తో మృతి చెందిన టువంటి సంఘటన కాదని విద్యుత్శాఖ అధికారి తెలపడంతో తరచూ మృతు డి హేమంత్ గుండెనొప్పి అని వైద్య పరీక్షలు చేయించుకునే వాడు. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చునని స్థానికులు అంటున్నారు. మృతునికి ఒక కుమారుడు భార్య, తల్లి దండ్రులు, తమ్ముడు ఉన్నారు. కుటుంబానికి ప్రధాన జీవనాధారం మృతునిపై ఆధా రపడి కుటుంబం జీవిస్తున్నది. ప్రభుత్వం కుటుంబానికి ఆర్థిక సహాయం చేసే ఆదుకో వాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ప్రాథమిక స్థాయి పాఠశాలలో ఐదు తరగతులకు నలుగురే పిల్లలు

- కొత్త కండ్రిగ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీరు ఇది

విశాలాంధ్ర- సత్యవేడు: పేదపిల్లలకు ప్రాథమిక విద్య దూరం కాకూడ దన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ ప్రాథమిక పాఠశాలలను నడుపుతోంది. అయితే రాను రాను ప్రైవేట్ పాఠశాల సంఖ్య అధికం కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల అడ్మిషన్లు క్రమేణ తగ్గిపోతుంది .ఇందుకు సత్యవేడు మండలం కొత్తమారికుప్పం పరిధిలోని కొత్తకండ్రిగ ప్రాథమిక పాఠశాల నిదర్శనంగా నిలుస్తోంది.ఈ పాఠశాలలో ప్రస్తుతం ఐదు తరగతులు గాను నలుగురే పిల్లలు ఉన్నారు.అందులోనూ ఒకటి,రెండు,మూడు తరగతులకు సంబంధించి విద్యార్థులు అడ్మిషన్ ఒక్కరంటే ఒకరు లేకపోవడం గమనార్హం.అయితే నాలుగు ఐదు తరగతుల్లో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు సంబంధిత ఉపాధ్యాయురాలు ప్రభావతి పేర్కొన్నారు.గతంలో కొత్త కండ్రిక ప్రాథమిక పాఠశాల పిల్లలతో కలకలలాడేది.కానీ గత రెండు మూడేళ్లుగా విద్యార్థుల అడ్మిషన్ తగ్గుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం కొత్తకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ముచ్చటగా నలుగురు విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు.ప్రభుత్వ పాఠశా లలో పిల్లల అడ్మిషన్లను పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల విద్యాప్రవేశం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.ఇందులో భాగంగానే జూన్ 24 నుంచి జూలై 25 వరకు ఆయా పాఠశాలలో సంబంధిత ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యాప్రవేశం కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నారు.కానీ ప్రభుత్వ పాఠశాలలో ఆశించిన మేరకు పిల్లల అడ్మిషన్లు జరగడం లేదన్న ప్రచారం జరుగుతోంది. మరోపక్క ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన స్టూడెంట్ కిట్లు ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్నం భోజనం పథకం కూడా అమలు జరుగుతోంది.దీంతో పాటు తల్లికి వందనం పథకంలో ప్రతి ఏడాది ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయల సొమ్మును ప్రభుత్వం అందించనున్నది. అయితే విద్యా వ్యవస్థలో విద్యార్థుల సౌకర్యార్థం పలు పథకాలను అమలు చేస్తున్న కొన్ని ప్రభుత్వ బడులలో పిల్లల అడ్మిషన్లు నామమాత్రంగా ఉంది.అధిక శాతం తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించ డంతో ప్రభుత్వ బడులలో పిల్లల అడ్మి షన్లు తగ్గుతున్నట్లు జరుగుతున్న పరిణామాలు సూచిస్తున్నా యి.పైగా కొత్త కండ్రిక ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు తగ్గట్టుగా పిల్ల లు లేకపోవడం వల్ల ముందు ముందు పాఠశాలను మూసివేసిన ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇప్పటికైనా సంబంధిత విద్యాశాఖ అధికారులు దీనిపై స్పందించి కొత్త కండ్రిక ప్రాథమిక పాఠశాలలో పిల్లల అడ్మిషన్లు పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు తల్లిదండ్రులు వారి పిల్లల అడ్మిషన్లు విషయంలో ప్రైవేట్ పాఠశాల వైపు మొగ్గ చూపకుండా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి

- మంత్రి లోకేష్ బాబుకి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గూడూరు : అసెంబ్లీ సమావేశాలలో భాగంగా సెక్రెటరీ కార్యాలయం నందు విద్య శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గతంలో మీరు యువగలం పాదయాత్ర లో భాగంగా గూడూరు నియోజకవర్గం లో పర్యటించినపుడు మా నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు మిమ్మల్ని గూడూరు ను నెల్లూరు జిల్లా లో కలపవలసినందిగా కోరినపుడు మీరు పరిగణలోకి తీసుకుని కలుపుతామని తెలిపియున్నారని తెలిపి మా నియోజకవర్గ ప్రజల కోరికను నెరవేర్చవలసినదిగా కోరారు.అనంతరం మంత్రి వర్యులు లోకేష్ బాబు సానుకూలంగా స్పందించి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుని వీలైనంత త్వరగా చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట చిట్టమూరు మండలపార్టీఅధ్యక్షులుగణపర్తి కిషోర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై హత్యా ప్రయత్నం

- తప్పిన ప్రాణాపాయం

విశాలాంధ్ర- నాయుడుపేట : రాష్ట్రంలో రోజువారి ఏదో ఓ ప్రాంతంలో మహిళలపై మర్డర్లు, మానభంగాలు, అత్యాచా రాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లా, నాయుడుపేట మండలం, జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఎస్ కే ఎల్ ఎస్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం అర్ధరాత్రి ఓ మహిళపై కత్తితో దాడి చేసి హత్యా ప్రయత్నం చోటు చేసుకుంది. వివరాల మేరకు పూడేరు గ్రామానికి చెందిన లక్ష్మీ పెట్రోల్ బంకు సమీపంలోని దుకాణంలో నిద్రిస్తుండగా నాగార్జున అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనకు అక్రమ సంబంధాలే కారణమని స్థానికులు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. అయితే ఈ ప్రమాదంలోగాయపడిన మహి ళను పోలీసులు చికిత్స నిమిత్తం నాయుడుపేట సామాజిక వైద్యశాలకు తరలించారు. గాయపడిన మహిళ ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

201 బస్తాల తమిళ రేషన్ బియ్యం పట్టివేత



విశాలాంధ్ర - తడ : తమిళనాడు నుండి ఆంధ్రాకు రెండు బడా దోస్త్ మీని లారీల్లో అక్రమంగా తరలిస్తున్న 201 బస్తాల తమిళ రేషన్ బియ్యాన్ని స్థానిక రెవెన్యూ,పోలీసు, సివిల్ సప్లై అధికారులు పట్టుకున్న సంఘ టన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసు కుంది .తడ ఎస్.ఐ. వి.నరసింహారావు సమాచారం మేరకు చెన్నై నుండి ఆంధ్రాకు అక్రమంగా తమిళ రేషన్ బియ్యం తరలిస్తున్నారంటూ ముందస్తు సమాచారం రావడంతో అప్రమత్తమైన అధికారులు స్థానిక పోలీస్,రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు చెన్నై నుండి ఆంధ్ర వైపు వచ్చే వాహనాలను తడకండ్రిగ బోడిలింగలపాడు వద్ద తమిళనాడు వైపు నుండి రెండు బడా దోస్త్ మినీ లారీలను తనిఖీ చేయగా తమిళ రేషన్ బియ్యం బస్తాలు వుండటం తో వాహనాలను, లారీ డ్రైవర్లను అదుపులో తీసుకుని తడ పోలీస్ స్టేషన్ కు తరలించి వాహనం లోని బస్తాలను లెక్కించగా రెండు వాహనాల్లో 201 తమిళ రేషన్ బియ్యం వున్నట్లు గుర్తిం చారు మొత్తం 9920కేజీల రేషన్ బియ్యం విలువ సుమారు 2లక్షల 97వేల 600 రూపాయలు వుంటుందని తెలిపారు. అదుపులో తీసుకున్న లారీ డ్రైవర్లు ముత్తు,చెళ్ళప్ప దొరైని విచారించగా చెన్నై నుండి తడ కు చెందిన కుమార్ రెడ్డి, వాటంబెడుకు చెందిన కుమార్ రెడ్డి, ప్రతాప్ కుమార్ లకు ఈ రేషన్ బియ్యం తీసుకు వస్తున్న ట్లు తెలిపారు. ఈ దాడులలో తడ ఎస్.ఐతో పాటు ,తడ మండల డిప్యూటీ తాసీల్దార్ శరత్ కుమార్, సీ ఎస్ డీ టీ ఓబయ్య పాల్గొన్నారని ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ పేర్కొన్నారు.

టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర వైస్ ఛాన్సర్ అప్పారావుకి వినతి

విశాలాంధ్ర-తిరుపతి : ఇస్తూ, గత ఐదు సంవత్సరాలుగా ఎస్ వి యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విభాగంలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు లేకుండా వేల మంది విద్యార్థులు జీవితాలను నాశనం చేసినటువంటి గత ప్రభుత్వం, విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని టిఎన్ఎస్ఎఫ్ స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ ఆర్కే నాయుడు మాట్లాడుతూ, తక్షణమే సెల్ఫ్ ఫైనాన్స్ కోర్స్ ఏర్పాటు చేయాలని చెప్పడంతో తక్షణమే విసి స్పందించి రెండో కౌన్సిలింగ్ లో, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సును అందుబాటులో చేకూరుస్తామని తెలపడం జరిగింది, అదేవిధంగా గత ప్రభుత్వ హయంలో విద్యార్థులకు మౌలిక వసతుల సౌకర్యాల విషయంలో యూనివర్సిటీ విఫలమైం దని తక్షణమే విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేస్తామని తెలియప రుస్తూ, యూనివర్సిటీలో రిటైర్డ్ అయినటువంటి ప్రొఫెసర్లలకు సంబంధించిన టువంటి గదులు ఇప్పటికి కూడా వినియోగించడం వల్ల నష్టం వాటిల్లుతుందని తక్షణమే గదులను యూనివర్సిటీ స్వాధీనం చేసుకోవాలని, అదేవిధంగా యూనివర్సిటీలో ఉన్నటువంటి హాస్టల ను ఉన్నతమైనటువంటి అధికారులు విజిట్ చేయాలని కోరుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఒకే దగ్గర విధులు నిర్వహించడం వల్ల అనేక సమస్యలు వెళ్లవెత్తుతున్నాయ అని తక్షణమే వీటిపై దృష్టి సాధించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థులు భీష్మ, నర్సోజి, భీమేష్ ,రాజు ,గణేష్, రవి, వంశీ, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు...

రామగిరి ఆలయానికి తారు రోడ్డు పనులు పూర్తి

ఆడికృత్తిక భక్తుల సౌకర్యార్థం

రూ.56 లక్షలతో 1.2 కిలోమీటర్లు మేర తారు రోడ్డు

విశాలాంధ్ర -పిచ్చాటూరు : సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు మండలం రామగిరి బస్టాండ్ నుండి శ్రీ వాలీశ్వర స్వామి ఆలయం వరకు తారు రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో ఆర్ - బి అధికారులు పూర్తి చేశారు.అయితే ఈ నెల 28,29,30వ తేదీలలో రామగిరి శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆడికృత్తిక తప్పోత్సవాలు వైభవంగా జరుగనుంది.ఈ తెప్పోత్సవాలకు సుమారు 30 వేల మంది భక్తులు ఆలయానికి చేరుకొని కావళ్ళు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.ఈ నేపథ్యంలో రామగిరి బస్టాండు నుండి ఆలయం వరకు రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచి అధ్వానంగా తయారైంది.సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే శ్రీ కోనేటి ఆదిమూలం జిల్లా ఆర్ అండ్‌బి ఉన్నతాధికారుల దృష్టికి రోడ్డు సమస్యను తీసుకెళ్ళి ఆడికృత్తిక తెప్పోత్సవం లోపు రోడ్డు వేయాలని పట్టుబట్టారు. స్పందించిన ఆర్ అండ్‌బి ఉన్నతాది కారుల తక్షణం రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేశారు.

స్వాతంత్ర్య సమరయోధుల స్మరణ మరువొద్దు

- ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సమకూర్చిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం మరువద్దని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల శ్రీకాళహస్తిలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్ జయంతి, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ స్వాతంత్ర దినోత్సవం కోసం పోరాడిన ముఖ్యమైన వ్యక్తులని, స్వతంత్ర్య సమర యోధులను స్మరించుకోవడం మన బాధ్యతని, వారిని మరువకూడ దనన్నారు. స్కౌట్స్ ఇంచార్జ్ నరసింహారావు మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ గొప్పతనాన్ని వివరించారు. జిల్లా యూత్ ఛైర్మన్ షేక్ అజారుద్దీన్ మాట్లాడుతూ మాధవసేవే మానవసేవ అని, ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటండని, ఆ మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్ సుబ్రహ్మణ్యం, కళాశాల వీడీ నరసింహారావు, ధనుష్, రేంజర్ లీడర్లు సంఘవి, వైష్ణవి, కీర్తి, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధుల కేటాయింపు శుభపరిణామం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వికసిత్ భారత్‌లో భాగంగా నరేంద్ర మోదీ నాయకత్వంలో వరుసగా ఏడవసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం శుభ పరిణామమని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్ లో అదనంగా రూ.15వేల కోట్లు కేటాయింపుతో ఏపీకి పూర్వ వైభవం ప్రారంభమై పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేం దుకు క్యూ కడతారన్నారు. ఎన్డీయే కూటమి చారిత్రాత్మక విజయం సాధించి... ఏపీ పునర్విభజన చట్టానికి కట్టుబడి అమరావతి రాజధానికి...పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక అదనపు నిధులు సైతం కేటాయిస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ ఎన్డీయే కూటమిలో భాగస్వాములైనందుకు ఏపీకి మహర్దశ ప్రారంభమైం దన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు విశాఖ- చెన్నై కారిడార్ కు ప్రత్యేక నిధుల కేటాయింపుతో రవాణా రంగం ఏపీలో అగ్రగామిగా నిలుస్తుందని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఏపీలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు... రైల్వే, పోర్ట్, హైవేల అభివృద్ధితో పారిశ్రామికంగా ఆర్థికాభివృద్ధి వైపు పరుగులు తీస్తుందన్నారు. చిరు వ్యాపారుల కోసం ఇదివరకు మంజూరు చేస్తున్న 'ముద్ర' రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడం సామాన్య, మధ్యతరగతి వ్యాపారస్తులతో పాటు వీధి వ్యాపారులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతి యేటా లక్షమంది విద్యార్థులకు మూడు శాతంతో విద్యారుణం అందించడం అన్ని వర్గాల ప్రజలకు ఉన్నత చదువులు చదివే అవకాశం లభిస్తుందన్నారు. కార్మికులందరికీ డార్మెటరీ తరహా అద్దె ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమన్నారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారీ పరిశ్రమలు ఏర్పాటై నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. 500 పెద్ద కంపెనీల్లో కోటి మంది యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు శ్రీకారం చుట్టడం భవిష్యత్తుకు భరోసా కలిగించే అంశమన్నారు. నిరుపేదలు, రైతులు, యువత, మహిళల అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపుతో పాటు ఏపీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు ఏపీ ప్రజల తరఫున బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన డిఎల్పిఓ

విశాలాంధ్ర ఎఫెక్ట్ EFFECT

విశాలాంధ్ర - తడ : సోమవారం విశాలాంధ్ర దినపత్రికలో జాతీయ రహదారా డంపింగ్ యార్డా అన్న వార్తకు స్పందించి సూళ్లూరుపేట డిఎల్పిఓ రవీంద్రబాబు మంగళవారం డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డ్ ను వేరే ప్రాంతం లో ఏర్పాటు చేయుటకు తాసిల్దార్ కార్యాలయం తో సంప్రదించి తడ కండ్రిగ రైల్వే గేటు సమీపంలో ఎస్ డబ్ల్యు పి సి (చెత్త నుండి సంపద తయారీ కేంద్రం కొరకు) స్థల పరిశీలన చేశారు . రెవిన్యూ అధికారులు స్థలం చూపించిన అనంతరం ఆ ప్రదేశంలో డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేయనున్నట్లు డీ ఎల్ పి ఓ రవీంద్రబాబు విశాలాంధ్ర విలేకరికి తెలియజేశారు . ప్రస్తుతం జాతీయ రహదారి ప్రక్కన ఉన్న వ్యర్థాలు అన్నీ సమీప ప్రాంతంలోని హోటల్లు రెస్టారెంట్ల నుండి అనధికారకంగా వ్యర్థాలను జాతీయ రహదారి పైన వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వాటిని పర్యవేక్షించాల్సిన తడ కండ్రిగ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించి నందువల్ల తడ కండ్రిక సెక్రటరీకి మెమో అందజేయనున్నట్లు ఆయన తెలిపారు . డంపింగ్ యార్డ్ ను పరిశీలించేందుకు వచ్చిన సమయంలో ఓ హోటల్ నిర్వాహకులు ప్రైవేట్ వాహనం ద్వారా వ్యర్థాలను డంపింగ్ యార్డ్ లో వేసేందుకు ప్రయత్నిస్తుండగా డి ఎల్ పి ఓ రవీంద్రబాబు ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకొని వాహన దారునికి పదివేల రూపాయల జరిమానా విధించాలని పంచాయతీ కార్యదర్శి కి తెలియజేసి చెత్త వేసేందుకు వచ్చిన వాహనాన్ని సీజ్ చేసి పంచాయతీ కార్యాలయానికి తరలించాలని ఆదేశించారు . ఇదే తరుణంలో నేషనల్ హైవే అథారిటీ వారికి కూడా జాతీయ రహదారి పక్కనున్న వ్యర్థాలను తొలగించేటట్లు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయ్ కుమార్ కి సూచనలు ఇచ్చారు

వ్యవసాయ పనుల్లో

బిజీ బిజీగా అన్నదాతలు

- ట్రాక్టర్ల సహాయంతో పొలాల్లో దుక్కిలు

విశాలాంధ్ర - దొరవారిసత్రం: వ్యవసాయ పనులలో అన్నదాతలు బిజిబిజిగా ఉన్నారు. గత వారం రోజులు నుండి తొలకరి చినుకలు కురుస్తుండంతో అన్నదాతలు ఖరీఫ్ పంట సాగు చేయటకు సిద్దం చేసుకుంటున్నారు.తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని అక్కరపాక,పొలిరెడ్డి పాళ్లెం,తనయాలి,మినమలమూడి,తొగరమూడి,తదితర గ్రామాలల్లో అధిక సంఖ్యలో మెట్ట ప్రాంత రైతులు ఎల్డీ పంటను సాగు చేసుకుంటారు.ఈ క్రమంలో ముందుగానే వరి పంట వేయటకు బీడు ఉన్న భూములను ట్రాక్టర్ సహా యంతో దుక్కిలు సాగు చేసుకుంటున్నారు.దీనికి తోడు పల్లే ప్రాంత్రాలలో వ్యవసాయం చేయటకు కూలీలు కూడా గిరాకి పేరగడంతో అన్నధాతలు వ్యవసాయ పనులు చేయటకు నానా ఇబ్బందిలు పడుతున్నారు.

అమరావతికి ప్రత్యేక నిధులు కేటాయించడం శుభపరిణామం

-బీజేపీ మహిళా నేత చాగణం శైలజ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్ లో ప్రత్యేక నిధులు కేటాయించడం శుభపరిణామమని రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి చాగణం శైలజ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వికసిత్ భారత్ లో భాగంగా నరేంద్రమోదీ ప్రభుత్వంలో వరుసగా ఏడవ సారి బడ్జెట్ ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్ ఏపీకి మంచి ప్రాధాన్యత ఇచ్చారని చాగణం శైలజ అభిప్రాయపడ్డారు. యువత, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర బడ్జట్ లో పెద్ద పీట వేశారన్నారు. మహిళల అభివృద్దికి రూ.3 లక్షల కోట్లు కేటాయించడం ఆనందదా యకం అని ఆమె పేర్కొన్నారు. అలాగే విద్య, నైపుణ్యాభివృద్ధిలో యువ తకు పెద్ద పీట వేస్తూ రూ.1.48 లక్షల కోట్లు కేటాయించారన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న చేతి వృత్తుల మహిళలకు ముద్ర యోజన పథకంలో రుణం రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచడం హర్షణీయమని చాగణం శైలజ పేర్కొన్నారు. ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమరా వతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కేంద్ర బడ్జట్ లో ఏపీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినందుకు నిర్మలా సీతారామన్ కు చాగణం శైలజ కృతజ్ఞతలు తెలియచేశారు.

కార్మికులకు ఉచితంగా హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించాలి

విశాలాంధ్ర-పుంగనూరు: పుంగనూరు హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం మంగళవారం మూడు గంటలకు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండ కట్టారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి సంఘటిత, అసంఘటిత రంగంలో బ్రతుకుతెరువు కోసం పనిచేస్తున్న హమాలి, ఆటో, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకంతో పాటు సంవత్సరానికి ఒకసారి కార్మికులకు ఉచితంగా హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని హమాలి కార్మికులకు గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్పిఎస్ జిల్లా నాయకులు వి దామోదరం, పుంగనూరు నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి కే రామమూర్తి, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మున్నాతో పాటు పుంగనూరు హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, సురేష్, రమణ, జై కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దర్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలో పులివర్తి సుధా రెడ్డి

విశాలాంధ్ర - పాకాల : స్థానిక పట్టణంలోని హజరత్ షేక్ ఫరీద్ మస్తాన్ ఔలియా వారి దర్గా వద్ద మంగళవారం చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి ప్రత్యేక ప్రార్థనల లో పాల్గొన్నారు. దుర్గా వద్ద నిర్వహిస్తున్న ఉరుసు కార్యక్రమం సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ స్థానిక ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఉరుసును హిందువులు, ముస్లరెలు కులమతాలకు అతీతంగా జరుపుకోవటం ఎంతో సంతోషదాయకమని ఆమె అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్య, ఐశ్వర్యాలతో ఆనందంగా జీవించాలని అల్లాని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులతో పాటు టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టౌన్ సర్వీస్ బస్సులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చంద్రగిరి: గత కొన్ని సంవత్సరాలుగా ఆగిపోయిన చంద్రగిరి-రేణిగుంట టౌన్ సర్వీస్ లను ఎమ్మెల్యే పులివర్తి నాని పునః ప్రారంభించడం సంతోషదాయకం. పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థినీ విద్యార్థులకు ఆర్టీసీ బస్సు పాసులు కావాలి కానీ వారి తల్లిదండ్రులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయకుండా ఆటోలలో ప్రయాణించడం తగదంటూ సమాజ హితులు పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ టౌన్ సర్వీస్ బస్సులను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి ఆదాయాన్ని సమకూర్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తిరుపతి -వేలూరు, తిరుపతి- కాణిపాకం ఎక్స్ప్రెస్ బస్సులను వయా చంద్రగిరి మీదుగా వెళ్లేందుకు ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే రెండు టౌన్ బస్సులను నాగలమ్మ మలుపు వరకు, మరో రెండు టౌన్ బస్సులను శ్రీనివాసమంగాపురం వరకు నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. చంద్రగిరి బస్టాండులో మౌలిక వసతులైన తాగునీరు మరుగుదొడ్లు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలం, ఉప్పరపల్లి పంచాయతీ, ఊట్లవారిపల్లి ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఈనెల 27వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఆడికృతిక బ్రహ్మోత్సవాల గోడపత్రిక మరియు కరపత్రాలను మంగళవారం చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి ఆవిష్కరించారు. పులివర్తి నాని అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంతో 27వ తేదీ నుండి ఆడి కృతిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సమయా భావం వల్ల ఎమ్మెల్యే పులివర్తి నాని ఆవిష్కరించే అవకాశం లేకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు ,ఆలయ అధికారుల కోరిక మేరకు తాను గోడపత్రిక, కరపత్రాలను ఆవిష్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు. సుబ్రహ్మణ్యస్వామి వారి ఆడికృతిక బ్రహ్మోత్సవ గోడపత్రికలను ఆవిష్కరించే అవకాశం కలగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఈ కార్యక్రమం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేందుకు చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని ఇప్పటికే మూడు సార్లు అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారని ఇక్కడ జరగనున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు పరిసర ప్రాంతాల ప్రజలే కాకుండా పీలేరు, ఐరాల, చిత్తూరు, తిరుపతి తదితర ప్రాంతాల నుండి సైతం భక్తులు వస్తారన్నారు. తిరుత్తణి తర్వాత అంతటి ప్రాముఖ్యత కలిగిన దేవాలయంగా పేర్కొన్నారు. కావున బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిపించాలని ఆలయ కమిటీ సభ్యులను, ఆలయ అధికారులు, పలు శాఖల అధికారులను కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ఘనంగా ఉత్సవాలు జరగాలని అంతేకాకుండా ఇది దైవకార్యం కావడంతో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఆడి కృతిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడి భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఆలయం పరిసరాల చుట్టూ శానిటేషన్ చేయించాలని, ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని, పోలీసు యంత్రాంగం ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటుచేసుకుపోకుండా ముందస్తుగా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే పులివర్తినాని తగు సూచనలు చేసినట్లు గుర్తు చేశారు. కావున ప్రతి ఒక్కరూ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో యువరాణి, కమిటీ సభ్యులు, ఇతర శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల గదులు పరిశీలన

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలో ఉన్న తాసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ రికార్డులను భద్రపరిచిన గదులను పలమనేర్ డిఎస్పి విష్ణు రఘువీర్ పుంగనూరు అర్బన్ సీఐ జై కుమార్ నాయక్ తాసిల్దార్ జి.శివయ్య పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా పలమనేర్ డిఎస్పి విష్ణు రఘువీర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సంఘటన ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో విలువైన భూ రికార్డులు భద్రపరిచిన గదులను పరిశీలించడం జరిగిందన్నారు. మదనపల్లిలో జరిగిన సంఘటన పరిస్థితులు ఎక్కడ జరగకూడదనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా తాయారు కార్యాలయాలను పరిశీలిం చడం జరుగుతున్నది అన్నారు. భూ రికార్డులు ఉన్న గదులకు భారీ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు ప్రతిరోజు ఒక పోలీసు నియమించి భద్రత చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యాలయంలో రాత్రి సమయంలో అనుమానితులుగా ఎవరైనా సంచరించినట్లయితే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరడం జరిగింది.

మధ్యాహ్న భోజనంపై విచారణ

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న భోజనంలో అందజేస్తున్న గుడ్ల నాణ్యత పరిశీలనకు తిరుపతి జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ మంగళవారం సాయంత్రం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది మరియు మధ్యాహ్న భోజనఏజెన్సీ లతో విచారణ నిర్వహించారు. ఉపాధ్యాయ సిబ్బందికి మరియు మధ్యాహ్న భోజన ఏజెన్సీకి పాఠశాలలో మధ్యాహ్నభోజన నిర్వహణగురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్ఓ శివశంకర్, గూడూరు ఉప విద్యాశాఖ అధికారి ఎం.శాంతి, మండల విద్యాశాఖ అధికారి బి.మునిరత్నం పాల్గొన్నారు.

చంద్రబాబు పనితనానికి నిదర్శనమే ఏపీకి ప్రత్యేక సాయం

టిడిపి నాయకులు లక్కమనేని మధుబాబు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కేంద్ర బడ్జెట్‌లో రాష్టానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించటం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనితనానికి నిదర్శనమని టీడీపీ సీనియర్ నాయకుడు లక్కమనేని మధుబాబు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు ఉమ్మడిగా కలిసి కేంద్రంతో పలువిధాలుగా చర్చలు జరిపి రాష్టాన్ని ఆదుకోవాల్సిందిగా విన్నపాలు చేశారని ముఖ్యమంత్రి పలు పర్యాయాలు ఢిల్లీ కి వెళ్లి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి కేంద్ర పెద్దల తో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేశారని ఈ సందర్భంగా తెలియచేసారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కి రూ.15వేల కోట్ల నిధులు కేటాయించారని దీంతో అమరావతి పరుగులు పెడుతుందని అలాగే పోలవరం పూర్తయితే రాష్టం సస్యశామల అవుతుందని చెప్పారు. అదేవిధంగా ఆగిపోయిన వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పడం రాష్ట్ర ప్రగతికి నియోజకవర్గాల అభివృద్ధికి తోడ్పడుతుందని ఏపీలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం ఇవ్వడం వల్ల పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని తద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నీ వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని చెప్పారు. కేంద్ర బడ్జెట్ లో ఏపీకి ప్రత్యేక నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి, కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లో శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నెల రోజుల పాలనలో ముక్కంటి ఆలయ ప్రక్షాళన మొదలు పాలనలో ఎన్నో విప్లవాత్మక సాహస పేత నిర్ణయాలు తీసుకొచ్చారని తండ్రి మాజీ మంత్రివర్యులు కీర్తిశేషులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి బాటలో పైయనిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి వేస్తున్నారని. గోపాల న్నా పాలన మళ్లీ శ్రీకాళహస్తిలో వచ్చిందని నియోజకవర్గ వ్యాప్తంగా నెల రోజుల పాలన పై సర్వత్ర ప్రశంసలు అభినందనలు అందుకున్నారని శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివృద్ధి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తోనే సాధ్యమని స్పష్టం చేశారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని మాజీ కౌన్సిలర్ లు బిల్లు చెంచు రామయ్య, తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ లు పేర్కొన్నారు. మంగళ వారం గూడూరు రెండవ పట్టణం లోని మాళవ్య నగర్ వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో 15, 16, 17 సచివాలయాల పరిధిలోని పారిశుధ్య సిబ్బంది హాజరు కేంద్రానికి వెళ్ళి, సిబ్బంది హాజరు శాతాన్ని తనిఖీ చేసి, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా , డయేరియా లాంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా, పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వలలోని చెత్త ను పూర్తిగా తీసివేయాలని కాలువలలో ఆయిల్ బాల్స్ వేయాలని పారిశుధ్య ఇన్స్పెక్టర్లకు, శానిటరీ సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ ఆదేశాల మేరకు గూడూరు పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా, గూడూరు ను పచ్చదనం పరిశుభ్రతగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వీరి వెంట శానిటరీ ఇన్ స్పెక్టర్ లు పోలయ్య , రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పాపానాయుడుపేట ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తహ అవగాహన

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్వహిస్తున్న శిక్ష సప్తహ వారం రోజులు కార్యక్రమంలో రెండో రోజు మంగళవారం ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ) అవగాహన కార్యక్రమం పాపానాయుడుపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు ఏర్పేడు జెడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య తెలిపారు. నూతన విద్యా విధానం 2020 ప్రారంభమై నాలుగు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్వహిస్తున్న శిక్ష సప్తహ వారం రోజులు కార్యక్రమంలో రెండో రోజు మంగళవారం ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ) అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు జెడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సమీకృత అభివృద్ధి లక్ష్యాలులో భాగమైన నాణ్యమైన విద్య కోసము మన దేశంలో అమలవుతున్న నూతన విద్యా విధానం గురించి వివరించారు. విద్యార్థులను బృంద సభ్యులుగా చేసి వారితో కథలు చెప్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతన జీవులకు నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్

విశాలాంధ్ర-పలమనేరు : మంగళవారం లోక్ సభలో ఆర్థికశాఖ మంత్రి ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ నిరాశాపరిచిందని మేధావుల ఫోరం అధ్యక్షుడు ఎన్.సోమ చంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కంటితుడుపు చర్యగా ప్రామాణిక తగ్గింపు మొత్తాన్ని 50 వేల నుండి 75 వేలకు పెంచడం తప్ప ఇతర ఎటువంటి మార్పులు చేయలేదన్నారు. పెరిగిన జీవన ప్రమాణాల ఆధారం గా కనీసం రెండు లక్షలు పెంచాలన్నారు. పన్ను లేని ఆదాయం రెండు లక్షల కు కాకుండా 5 లక్షల వరకు ఉండాలన్నారు. బడ్జెట్ సవరణలో ఈ మార్పులు చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా నూతన పెన్షన్ విధానం లో మార్పులు చేస్తామన్న దాని విధివిధానాలు నిర్దిష్టంగా ప్రకటించలేదన్నారు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని పూర్తిగా రద్దువేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వి.కోట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-వి.కోట: స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్ ను జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం కుప్పం నియోజకవర్గంలో ని గుడిపల్లి పోలీసు స్టేషన్ కు వెళ్లి తిరుగు ప్రయాణంలో వి.కోటకు చేరుకున్న ఆయన స్థానిక పోలీసు స్టేషన్ కు చేరుకున్నారు స్టేషన్ ను అలాగే స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్ లో నిర్వహిస్తున్న కేస్ డైరీ, విలేజ్ రోస్టర్ అలాగే వివిధ క్రైమ్ రికార్డులను నేరుగా కంప్యూటర్ లో పరిశీలించారు స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను చూసి పెండింగ్‌లో ఉన్న వాహనాలను త్వరగా డిస్పోస్ చెయ్యాలని ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని సిబ్బంది కి సూచించారు. డ్రంకన్ డ్రైవ్ మరియు రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, తదితర కేసుల రికార్డులు పరిశీలించారు. రాత్రి మరియు పగలు బీట్ల పని తీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అప్పుడే నేరాలు తగ్గుతాయని తెలిపారు. అదే విధంగా రౌడీ షీటర్ల కదలికలు మరియు కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నేరాల అడ్డుకట్టకు నైట్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూ వివాదాలు, పాత గొడవలు మొదలైన వాటిని లిస్ట్ అవుట్ చేసి ఎలాంటి నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక అర్బన్ ఇన్స్పెక్టర్ ఎస్.లింగప్ప, ఎస్ఐ ఇ.బాబు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు

విశాలాంధ్ర-నాయుడుపేట: సోమవారం అర్ధరాత్రి అయ్యప్పరెడ్డి పాలెంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని నాయుడుపేట పోలీస్ శాఖ అధికారులకు సమాచారం రావడంతో ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లపై దాడులు చేసి ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఐదు ట్రాక్టర్లు ఇసుక లోడ్ చేసుకుని ట్రక్కుల్లో లోడ్ చేసుకుని స్వర్ణముఖినది నుంచి వెలుపలకి వస్తున్న సమయంలో, పోలీసులు దాడి జరిపి ఈ ట్రాక్టర్లను నాయుడుపేట పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

వీరభద్రుని ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని వీర భద్రుని ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మురు ముని మోహన్ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నమన్నారు. దాతల సహకారం మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమానికి దాతలుగా మీసుగుల రమాదేవి జ్ఞాపకార్థం డాక్టర్ వెంకట్ అరవింద్ వ్యవహరించారు.

గుంతల మయంగా మారిన తారు రోడ్డు

విశాలాంధ్ర-కార్వేటినగరం : మండల పరిధిలోనే కార్వేటి నగరం నుండి కోదండ రామాపురం వరకు వెళ్లే బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు. కాలి నడక నడిచే ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఈ రోడ్డును దాదాపుగా 25 సంవత్సరాల ముందు తారు రోడ్డును ఏర్పాటు చేసి పుత్తూరు నుండి కోదండరామాపురం వరకి ప్రయాణికులకు బస్సు సౌకర్యం కూడా అప్పటి టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.. అయితే అప్పటినుంచి గుంతలుగా ఉన్న చోటా గుంతలు పూడ్చారు. అనంతరం తారు రోడ్డు పైన గుంతలు పూడ్చి తారు రోడ్డును నూతనంగా ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని సిడికండిగా రాజుల కండిగ కోదండ రామాపురం టీకేఎం పేట వాసులు రోడ్లు భవనాల శాఖ అధికారులు కోరుతున్నారు. ఈ రోడ్డును అధికారులు పర్యవేక్షించి బాగు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపికి బ్రహ్మరథం పట్టిన మోడీ సర్కారు

శ్రీకాళహస్తిలో కోలాహలంగా సంబురాలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో నరేంద్రమోడీ సర్కారు బ్రహ్మరథం పట్టారని, రాష్ట్రానికి ఎన్నడు లేని విధంగా అద్భుతమైన అవకాశాలు కల్పించారని కేంద్ర బడ్జెట్ కేటాయింపులుపై శ్రీకాళహస్తి నందు కోలా ఆనంద్ నేతృత్వంలో బిజెపి నాయకులు మంగళ వారం కోలాహలంగా సంబరాలు జరుపుకున్నారు. భారతీయ జనతా పార్టీ స్థానిక పట్టణ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జులై 23న లోకసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 కేంద్ర బడ్జెటును సమర్పించిన సందర్భంగా కోలా ఆనంద్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రస్తుత ఎన్డీయే కూటమిలో కీలకమైన తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తాజా బడ్జెట్ లో అత్యంత ప్రాధాన్యత నరేంద్రమోడీ సర్కారు ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రజలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడానికి పూర్తి స్థాయిలో ఆర్థిక సాయం చేయడానికి బడ్జెట్ రూప కల్పన చేశారని చెప్పారు. అలానే రాష్ట్ర నూతన రాజధానికీ పూర్తిగా ఆర్థిక సాయం చేస్తామని తెలిపారని, అందులో భాగంగా 15,000 కోట్లు అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారు. ఆంధ్రలో పారిశ్రామిక అభివృద్ధికీ, నీరు, విద్యుత్, రోడ్లు అభివృద్ధి కోసం అదనపు కేటాయింపులు, విశాఖ - చెన్నై, ఓర్వకల్లు - బెంగళూరు మధ్య ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రీ కారిడార్లకు నిధులు కేటాయింపులు చేయడం జరిగిందని కోలా ఆనంద్ ప్రెస్‌మీట్‌లో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయల సీమ, కోస్తాంధ్ర, ప్రకాశం జిల్లాల అభివృద్ధికీ ప్రత్యేక నిధులు కేటాయింపులు అందిస్తామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి కట్టుబడిన ఎన్డీయే ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు తరపున నరేంద్రమోడీ, నిర్మలా సీతారామన్, నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కోలా ఆనంద్ తెలిపారు. అనంతరం కార్యాలయం ఎదుట టపాకాయలు పేల్చి, బీజేపీ జిందాబాద్, ఎన్డీయే కూటమి వర్ధిల్లాలి, నరేంద్రమోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ, పుర ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులుకు, మీడియా ప్రతిధులకు స్వీట్లు పంచుకుని ఆనందన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రెటరీ, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్‌తోపాటు జిల్లా సెక్రెటరీ, అసెంబ్లీ కో - కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, రాష్ట్ర ఓబీసీమోర్చా సభ్యులు ఎస్వీ రమణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు, లింగాబత్తిన గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు, జీవి అమర్నాథ్, ప్రధాన కార్యదర్శులు మద్దు వాసు యాదవ్, పుణ్యం ఢిల్లీ కుమార్, యువమోర్చా అధ్యక్షులు తానికొండ్ల భరత్ కుమార్ నాయుడు, సజ్జల హరీష్, కె. హరీష్ రెడ్డి, పెద్దపాలెం శివ రెడ్డి, పుచ్చకాయల రమేష్ యాదవ్, ఇమ్మిడిశెట్టి మోహన్, సురా బిందు కుమార్, సింగమాల గిరిధర్ సాయి, సిద్ధూ, నాని, కోలా మురళి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ప్రభుత్వ సేవలకు అంతరాయం

- సుమారు 6 నెలలుగా డిజిటల్ అసిస్టెంట్ లు కొరత

- ఎంపిడిఓ ఉత్తర్వులకు రాజకీయ గ్రహణం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ లు లేక ప్రభుత్వ సేవలకు అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో బొమ్మయ్యపల్లి, మాంబేడు,పచ్చికాపల్లం సచివాలయాల్లో సుమారు 6 నెలలుగా ప్రభుత్వ సేవలు సక్రమంగా అందకుండా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపధ్యంలో ఇటీవల స్థానిక ఎంపిడిఓ వరప్రసాద్ మండలంలోని పాతగుంట సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ తేజోవతి కి మాంబేడు సచివాలయం కు,అలాగే వెదురుకుప్పం మండల కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్ సతీష్ కు పచ్చికాపల్లం సచివాలయంలో అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు జారీ చేసి 10 రోజులు కావస్తున్నా ఆచరణ సాధ్యపడలేదు. అంటే ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులు నిర్దేశించిన సచివాలయాలకు విధులకు హాజరు కాలేదు.మండల అభివృద్ధి అధికారి అందించిన ఉత్తర్వులకే జవాబుదారీతనం లేకపోతే ఇదంతా గాడి తప్పిన పాలనకు నిదర్శనమా అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా ఈ ఉత్తర్వులు రాజకీయ గ్రహణం వల్లే అమలు కాలేదని సమాచారం. సచివాలయంలో సేవలకు డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగులే కీలకం కాబట్టి శాఖాపరమైన చర్యలలో భాగంగా ఉద్యోగులని నియమించి ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని జిల్లా ఉన్నతాధికారులు కు పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి భారీగా నిధులు పట్ల హర్షం

విశాలాంధ్ర-తిరుపతి : కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి భారీగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించడంపట్ల ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల కృషికి తోడు ప్రధానమంత్రి మోది మద్దతుతో రాష్ట్రానికి భారీగా నిధుల కేటాయింపు జరిగిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో టిడిపి, బీజేపీలను కూటమిగా ఏర్పాటు చేయడంలో జనసేనాని పవన్ కళ్యాణ్ వల్లే సాధ్యమైందని దీనితో కేంద్ర ప్రభుత్వ మద్దతుతో నిధులు భారీగా వస్తున్నాయని ఆయన చెప్పారు. రాష్ట్ర రాజధాని కి 15వేల కోట్ల రూపాయలు కేటాయింపుతో అమరావతి పనులు వేగమంతమవుతాయని ఆయన తెలిపారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో రాజధాని ఏది అంటే చెప్పలేని పరిస్థితి నెలకొందని కేంద్రం మద్దతుతో అమరావతి నిర్మాణాన్ని సిఎం చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తారని ఆయన చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రజల జీవనాడైన పోలవరం ప్రాజెక్టు భారీగా నిధులు కేటాయించడంతో ఆ ప్రాజెక్టు కూడా అంచనాలకు అనుగుణంగా ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి చేసే అవకాశం దక్కిందని ఆయన తెలిపారు.

శ్రామిక్ నగర్‌లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచండి

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని జక్కా వెంకయ్య శ్రామిక నగర్ నందు పారి శుధ్యన్ని మెరుగు పరచండి అని గూడూరు సి.పి. ఎం నాయకులు గూడూరు పురపాలక కమిష నర్ కీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సి.పి.ఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివ కుమార్ మాట్లాడుతూ జక్కా వెంకయ్య శ్రామిక నగర్ నందు గత 20 సంవత్సరాలు నుండి సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో గత కొన్ని రోజుల నుండి డ్రైనేజీ, వ్యర్థ పదార్థాలు మొత్తం ఇంటి లోపలకు వెళ్తుండటం వల్ల అనారోగ్య పాలవుతున్నారన్నారు. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు, రమణయ్య, ప్రసాద్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - కోట: ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ ను బీజేపీ నాయకులు కోరారు. గూడూరు డివిజన్లో ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సౌకర్యాలు లేక రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రిని విజయవాడలోని వారి నివాసంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వర రావు, తిరుపతి జిల్లా బిజెపి కోర్ కమిటీ నాయకులు దువ్వూరు గిరిధర్ రెడ్డి, తిరుపతిజిల్లా బిజెపి సీనియర్ నాయకులు పాదర్తి కోటారెడ్డి, గూడూరు అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ పురుషోత్తమ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వచ్చే నెల 9వ తేదీ నెల్లూరు జిల్లా పర్యటన ఉందని ఆక్రమంలో గూడూరు డివిజన్ లోని ఆసుపత్రులను పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు కోటేశ్వర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి అన్నారు. ప్రస్తుతం మన జిల్లాలో 350 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగులో ఉన్నదని, ఆయిల్ 1993 ప్రకారం, ఆయిల్ పామ్ సాగు, ఆయిల్ పామ్ మొక్కలు సరఫరా దారులు, ఆయిల్ పామ్ కొనుగోలు మరియు ఆయిల్ పామ్ ధరలు నిర్ణయించ బడతాయని, ప్రస్తుతం మన తిరుపతి జిల్లాలో 27 మండల్లాలో, ఆయిల్ పామ్ సాగు చేయవచ్చునని సంస్థ ధృవీకరించడం జరిగిందని తెలిపారు. తదుపరి ఆ మొక్కను జిల్లాలోని పలు మండలాల్లోని ఆయిల్ పామ్ కంపెనీలకు కేటాయించారో హార్టికల్చర్ కమీషనరు వారు ఉత్తర్వుల ద్వారా తెలియజేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం మన జిల్లాలో 4 కంపెనీలు ఆయిల్ పామ్ మీద పనిచేయుచున్నవి. ప్రస్తుత సంవత్సరం మన జిల్లాకు 400 సాగును నిర్దేశించడం జరిగిందని అన్నారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన 4 సంవత్సరాల నుండి దిగుబడి ఇస్తాయని,4 నుండి 8 సం" వరకు 8-12 టన్స్, 8 సం పైబడిన మొక్కలు 20 టన్నుల వరకు హెక్టారుకు దిగుబడి ఇస్తాయని తెలిపారు. కంపెనీ పేరు.. కేటాయించిన మండలాలు 1.గోద్రేజ్, వడమాల పేట, కె.వి.బి పురం, శ్రీకాళహస్తి, సత్యవేడు, వరదయ్య పాలెం. 2. 3పురం, ఏర్పేడు, తొట్టంబేడు, పుత్తూరు, పిచ్చాటూరు, బి.ఎన్ కండ్రిగ 3.అగ్రోస్: నారాయణ వనం నాగాలాపురం 4. సింహపురి: నెల్లూరు జిల్లా నుండి వచ్చిన 14 మండలాలు.రాయితీలుబీ ఒక హెక్టారుకి 143 మొక్కలు అవసరం అయితే మొక్కలుకు 100 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని, విదేశాల నుండి దిగుమతి చేసకున్న మొక్కలయితే హెక్టారుకు రూ.29, స్వదేశీ రకాలైతే హెక్టారుకు రూ.20 వేలు రాయితీ ఇవ్వడం జరుగుతుందని, ఇది కాక ప్రతి సంవత్సరం నిర్వహణ ఖర్చులకు రూ.5,250 ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాగే 4 సంవత్సరముల వరకు అంతర పంటకు గాను రూ.5,250 చొప్పున రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములలో ఆయిల్ పామ్ యొక్క సాగు వివరాలు, ఖర్చులు, రాబడులు, మెరుగైన పద్ధతుల గురించి అవగాహన కల్పించడం, తద్వారా ఆసక్తి గల రైతులను గుర్తించి, వారికి మొక్కలు సరఫరా చేసి, సాగును ప్రోత్సహించడం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని, ఇప్పటి వరకు 2 మెగా ప్లాంటేషన్ కార్యక్రమాలను రూపకల్పన చేసి, 50 ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలను నాటించడం జరుగుతుందని, ఇది కాక -ఇప్పటి వరకు 150 ఎకరాలకు రైతులను గుర్తించడం జరిగింది. కనుక అందరు రైతులు ఈ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం ను సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు.

ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఎస్వీయూనివర్సిటీ విడుదల చేసిన 3వ సెమిస్టరు ఫలితాలలో ఆక్స్ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎస్వీయూనివర్సిటీ విడుదల చేసిన 3వ సెమిస్టరు ఫలితాలలో ఆక్స్ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టణ, యూనివర్సిటీ స్థాయి లలో అన్ని గ్రూపులలో అగ్ర స్థానాలను కైవసం చేసుకున్నారు. బి.ఎస్సీ (యం.యస్. సీఎస్) గ్రూపులో సి. సింధు (9.71), పి.బాలాజీ రెడ్డి(9.01), ఏ.లిఖిత(8.02), బి.ఎస్సీ (యం.పి.సీఎస్) గ్రూపులో పి. మౌనిక (8.71), పి.గోపి ప్రియ (8.67), ఎస్ . నాగ లక్ష్మి (8.61), బి.ఎస్సీ (బయోటెక్నాలజీ) గ్రూపులో కె.యోగేశ్వరి (8.77), కె.కల్పన (7.68), టి.ప్రేమ్ కుమార్ (7.44) పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నారు.బి.కామ్ (సి.ఎ) గ్రూపునందు కె.హిమ (8.99), పి లలిత కుమారి(8.68), సి పావని(8.68), ఎస్.కె ఇమ్రాన్ ఫరూక్ (8.59), సి.పవన్ కళ్యాణ్ (8.59) పాయింట్లతో పట్టణ, యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సి.మధు సూధన్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు జగన్మోహన్ రెడ్డికి ఉందా?

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు ఉందా అని తిరుపతి పార్లమెంటు యస్టీ సెల్ అధ్యక్షులు యం. సుబ్బయ్య ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వ్యక్తుల్లో ఎవరైనా ఉన్నారంటే మొట్టమొదటి వరుసలో జగన్మోహన్ రెడ్డి ఉంటారని అన్నారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో నీ బూతుల మంత్రులతో గౌరవ సభను కౌరవసభగా మార్చి, సభ్య సమాజం తలదించుకునే లాగా అసెంబ్లీని మార్చిన నువ్వు రాజ్యాంగం, విలువలు గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని తెలిపారు. సభా సాంప్రదాయాలు తెలియని నువ్వు, సభలో ఎలా ప్రవర్తించాలో ముందు అది నేర్చుకుని తరువాత ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే బాగుంటుంది అన్నారు. ప్రజాస్వామ్య విలువలు గురించి మీ దగ్గర నేర్చుకోవాల్సిన కర్మ ఈ రాష్ట్ర ప్రజలకు పట్టలేదని, ప్రజాస్వామ్యం గురించి నువ్వు ఎంత తక్కువ మాట్లాడితే నీకే అంత మంచిదని హితవు పలికారు.

వేతన జీవులను నిరాశ పరచిన కేంద్ర బడ్జెట్

విశాలాంధ్ర-పలమనేరు: కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్ సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉద్యోగ వర్గాలకు తీవ్ర నిరాశ కల్పించిందని పలమనేరు తాలూకా ఏపీ ఎన్జీజీఓ సంఘం అధ్యక్షులు కె.ఆనందబాబు పేర్కొన్నారు. అధికశాతం మంది ఆదాయ పు పన్ను కట్టే పాత విధానంలో ఎటువంటి సవరణలు చెయ్యకుండా, తక్కువ శాతం మంది మాత్రం పన్ను కట్టే నూతన విధానంలో కొన్ని రాయితీలు కల్పించిన కేంద్ర నిర్ణయం వల్ల, ఉద్యోగ వర్గాలకు, పన్ను చెల్లింపు దారులకు ఎటువంటి ఉపశమనం కలగలేదని తెలిపారు. అంతేకాక కోట్లాది మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరే పాత పెన్షన్ పునరుద్ధరణపై ఎటువంటి సానుకూల ప్రకటన కూడా చెయ్యకపోవడం వల్ల ఉద్యోగ వర్గాలకు తీవ్ర అసంతృప్తి కలిగించే బడ్జెట్ గా ఉందన్నారు. అయితే పీకల్లోతు కష్టాల్లో ఉన్న విభజిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి విభజన హామీల అమలులో భాగంగా అమరావతి రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు, పరిశ్రమల స్థాపనకు, వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక నిధుల కేటాయింపులకై బడ్జెట్ లో ప్రాధాన్యం కల్పించడంపై హర్షం వెలిబుచ్చారు.

ఒలంపిక్ ఆకారంలో క్రీడాకారులకు రెడ్ చెర్రీ స్కూల్ విద్యార్థుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర-తిరుపతి: స్థానిక భైరాక పట్టిడి, రాఘవేంద్ర నగర్ నందు గల రెడ్ చెర్రీ స్కూల్ విద్యార్థులు ఒలంపిక్ సింబల్ ఆకారంలో క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. రెడ్ చెర్రీ స్కూల్ విద్యార్థులు ఒలంపిక్ సింబల్ ఆకారంలో కూర్చొని భారతదేశం తరపున ఒలంపిక్ గేమ్స్ 2024లో పాల్గొనబోతున్న భారతీయ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. జయహో భారత్, వందే భారత్ లాంటి నినాదాలు మిన్ను ముట్టాయి. ఈ సందర్భంగా పాఠశాల అధినేత సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు దేశానికి, దేహానికి మంచివి అని అన్నారు. క్రీడలు దేశాల మధ్య సహృద్భావవాతవరణాన్ని పెంపొందిస్తే, అవే క్రీడలు శారీరకంగా దృఢంగా ఉంచుతాయి అని తెలిపారు. పాఠశాల దశనుండే విద్యార్థుల క్రీడల పట్ల ఆసక్తికరపరచాలని కోరారు.

ఆగస్ట్ 15 నాటికి అన్నా క్యాంటీన్లు ప్రారంభానికి

మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-తిరుపతి : పేదలకు నామ మాత్రపు ధరతో ఆకలి తీర్చేం దుకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్న తమైన ఆశయానికి అనుగు ణంగా అన్నా క్యాంటీన్ లను జిల్లాలోని అన్ని నియోజక వర్గాలలోని మునిసిపల్ పరిధిలో ఆగస్ట్ 15 నుండి తప్పక ప్రారంభించేలా చర్యలు తీసు కోవా లని అధికా రులను జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఆదేశిం చారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల కమిషనర్ల తో గూగుల్ మీట్ నిర్వహించి వర్చువల్ విధానంలో కమిషనర్లతో మాట్లాడుతూ ఆగస్ట్ 15 నాటికి జిల్లాలో 11 అన్నా క్యాంటీన్లు ప్రారంభం కావాలని ఆదేశించారు. తిరుపతిలో 4 క్యాంటీన్లు ఎం.ఆర్.పల్లి, ఈ ఎస్ ఐ ఆసుపత్రి సమీపంలో, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్, న్యూ బాలాజీ కాలనీ లలో గతంలోని అన్నా క్యాంటీన్ భవనాలను మరమ్మత్తులు పూర్తి చేసి ఈ నెల జూలై 31 నాటికి సిద్ధం చేయాలని సూచించారు. శ్రీకాళహస్తి మునిసిపాలిటీ నందు 2 క్యాంటీన్లు రామసేతు బ్రిడ్జి వద్ద, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్ నందు గుర్తించిన భవనాలు మరమ్మత్తులు ఆగస్ట్ 10 నాటికి పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే నాయు డుపేట మునిసి పాలిటీ నందు అన్నా క్యాంటీన్ ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద గుర్తించిన భవనాలు మరమ్మత్తులు పూర్తి చేసి ఆగస్ట్ 15 నాటికి అందుబాటులోకి తెస్తామని అధికారులు తెలిపారు. సూళ్లూరుపేట మునిసిపాలిటీ నందు కళాక్షేత్రం ఎదురుగా, గాండ్ల వీధి నందు గుర్తించిన భవనం మరమ్మత్తులు ఆగస్ట్ 5 నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. గూడూరు పట్టణంలోని పాత బస్ స్టాండ్ సమీపంలోని బొగ్గుల దిబ్బ వీధిలో అన్నా క్యాంటీన్ భవన మరమ్మత్తులు ఆగస్ట్ 5 నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. అలాగే వెంకట గిరి మునిసిపాలిటీ నందు అన్నా క్యాంటీన్ ఎంపిడిఓ కార్యాలయ సమీపంలో మరమ్మతు లకు చర్యలు తీసుకు న్నామని తెలపగా వచ్చే నెల ఆగస్ట్ 15 నాటికి ప్రారంభమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పుత్తూరు మునిసిపాలిటీ నందు అన్నా క్యాంటీన్ కొరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొత్త నిర్మాణం చేపట్టడానికి టెండర్లు పిలిచామని, సమయం పడుతుందని కమిషనర్ తెలిపారు. ఆగస్ట్ 15 నాటికి అన్నా క్యాంటీన్లు ప్రారంభం కొరకు మరమ్మత్తులు, భవన నిర్మాణ పురోగతిని మునిసిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ వర్చువల్ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఏడు మున్సిపాలిటీ ల మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సెక్షన్ డిటి శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి గుర్తించిన భూమిని

త్వరితగతిన పర్యాటక శాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలి: కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : తూపిలిపాలెం బీచ్‌లో పర్యాటక అభివృద్ధికి త్వరిత గతిన భూమిని పర్యాటక శాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టా లని సంబంధిత రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు.మంగళవారం ఉదయం స్థానిక కలె క్టరేట్ ఛాంబర్ నందు కలెక్టర్ గూడూరు డివిజన్ నందలి వాకాడు మండలం తూపిలిపాలెం బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి పరిచేం దుకు రిసార్ట్స్ కొరకు అందుబాటులోని 6.50 ఎకరాల భూమిని నిబం ధనల మేరకు పర్యాటక శాఖకు అప్పగించే విధంగా చర్యలు చేప ట్టాలని తాసిల్దార్‌ను ఆదేశించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి కలెక్టర్‌కు వివరిస్తూ రిసార్ట్స్ ఏర్పాటుకు, వాటర్ స్పోర్ట్స్ కు చర్యలు తీసుకొనున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సిబ్బంది ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు

- టిటిడి ఈవో శ్యామలరావు

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు మరింత నాణ్యంగా, రుచికరంగా అందించాలనే లక్ష్యం దిశగా టిటిడి చర్యలు చేపట్టింది. ఇప్పటికే తీసుకున్న చర్యల వలన లడ్డూ ప్రసాదాల రుచి, నాణ్యత పెరిగిందని టిటిడి ఈవో జె. శ్యామల రావు చెప్పారు. అదేవిధంగా తక్కువ నాణ్యత గల నెయ్యిని సరఫరా చేస్తున్న సరఫరాదారులు నిబంధనలు పాట ్ంచకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో హెచ్చరించారు.తిరుమల గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో మంగళ వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, లడ్డూ నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టామని, నాణ్యమైన నెయ్యి ద్వారా లడ్డూ నాణ్యత పెరుగుతుందని నిపుణులు తెలిపారన్నారు. ప్రస్తుతానికి అడల్ట్రేషన్ టెస్ట్ చేసే పరికరం టీటీడీ వద్ద లేదని, త్వరలో ఏర్పాటు చేయను న్నట్లు తెలిపారు. ముడి సరు కులు, నెయ్యి ప్రొక్యూర్ మెంట్ సిస్టంలో కొన్ని ఇబ్బందులు ఉన్నా యన్నారు. నాణ్యమైన నెయ్యి కొనుగోలుకు సంబంధించి నలుగురు ప్రముఖ డైరీ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఎన్ డిఆర్‌ఏ విశ్రాంత ఆచార్యులు డా.సురేంద్రనాథ్, హైదరాబాద్ కు చెందిన డా.విజయ భాస్కర్ రెడ్డి, ప్రొ.స్వర్ణ లత, బెంగుళూరుకు చెందిన డా.మహదేవన్ ఉన్నార న్నారు. ఈ కమిటీ వారంరోజులలో నివేదిక అందిస్తారని తెలిపారు. క్వాలిటీ నెయ్యి కోసం టెండర్ లో ఎలాంటి అంశాలు చేర్చాలని ఈ కమిటీ దిశ నిర్దేశం చేస్తుందన్నారు. నెయ్యికి సువాసన చాలా అవసరమని, వీటి ద్వారా రేటింగ్ వేయడా నికి నివేదిక ఇవ్వాలని కమిటీని కోరినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుత సప్లయర్స్ ను పిలి చి క్వాలిటీ నెయ్యి సరపరా చేయాలని సూచి ంచాం, కొన్ని సంస్థలు హై క్వాలిటీ నెయ్యి పంపిస్తున్నారు, మరికొన్ని సంస్థలు నాసిరకం నెయ్యి అందిస్తు న్నాయి. ఓ సంస్థ అడల్ట్రేట్ నెయ్యి ఇస్తున్నట్లు, వెటిటబుల్ ఫ్యాట్ కలుపుతున్నట్లు ఎన్‌ఏబిఎల్ టెస్ట్ లో తేలిందన్నారు.టీటీడీకి సరఫరా చేస్తున్న నెయ్యి నమూనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేంటరీస్‌కు పంపినట్లు తెలి పారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న ఐదుగురు సరఫరాదారులలో ఒకరు అందించిన నెయ్యి నాణ్యత ప్రమాణాలు సరిపోలడం లేదని మరియు కల్తీ నెయ్యిని సరఫరా చేస్తు న్నట్లు పరీ క్షల్లో నిర్ధారణ అయినట్లు చెప్పారు.టెండర్ నిబంధ నలను ఉల్లంఘిం చినందుకు ఒక కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాం, మరో కంపెనీపై చర్యలు తీసుకుంటామ న్నారు. రెండు కంపెనీలకు షోకా జ్ నోటీ సులు కూడా జారీ చేసి నట్లు ఆయన వివరించారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తగిన ప్రాధాన్యత

హర్షం వ్యక్తం చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ

విశాలాంధ్ర -చిత్తూరు : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు కురిపించడం పై చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. ఇదంతా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషివల్లే సాధ్యమైందని ఒక ప్రకటనలో ఎంపీ పేర్కొన్నారు. మంగళవారం లోక్ సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక సాయం చేయనున్నట్లు ప్రకటించారని వివరించారు. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడంతోపాటు, పోలవరానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, అలాగే వెలిగొండ ప్రాంతమైన ప్రకాశం రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించడంతోపాటు చిన్న మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని బడ్జెట్లో పొందుపరచడం గొప్ప విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేయడం అభినందనీయమన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేస్తామని ప్రకటించడం, విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడర్ అభివృద్ధికి నిధులు కేటాయించడం, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి స్పష్టం చేయడం శుభ పరిణామమని ఎంపీ తెలిపారు.

గవర్నర్‌కు ముక్కంటి తీర్థప్రసాదాలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : తెలంగాణ, ఝార?ండ్, పుదిచ్చేరి రాష్ట్రాల గవర్నరు సిపీ రాధాకృష్ణన్‌కి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి అసెంబ్లీ కన్వీనర్ కోలా ఆనంద్ ఘన స్వాగతం పలికారు. తిరుపతి తిరుమల శ్రీవారి దర్శనం కోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న తెలంగాణ, ఝార?ండ్, పుదుచ్చేరి రాష్ట్రాల గవర్నరు సీపీ రాధాకృష్ణన్‌ని కోలా ఆనంద్ ఘన స్వాగతం పలికారు. శ్రీకాళహస్తీశ్వరాస్వామివారి శేషవస్త్రం కప్పి, దేవస్థానం తీర్థప్రసాదాలు, చిత్ర పటాన్ని అందజేశారు. గవర్నరుతో విఐపి లాంచ్ లో కోలా ఆనంద్ ప్రత్యేకంగా భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో - కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, రాష్ట్ర ఓబీసీమోర్చా సభ్యులు ఎస్వీ రమణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు, లింగాబత్తిన గోపాల్, కన్నా వెంజటేశ్వర్లు, జీవి అమర్నాద్, ప్రధాన కార్యదర్శిలు మద్దు వాసు యాదవ్, పుణ్యం ఢిల్లీ కుమార్, యువమోర్చా అధ్యక్షులు తానికొండ్ల భరత్ కుమార్ నాయుడు, సజ్జల హరీష్, కె. హరీష్ రెడ్డి, పెద్దపాలెం శివా రెడ్డి, పుచ్చకాయల రమేష్ యాదవ్, ఇమ్మిడిశెట్టి మోహన్, సురా బిందు కుమార్, సింగమాల గిరిధర్ సాయి, సిద్దూ, నాని, కోలా మురళి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాలో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి సిటి, వడమాలపేట, నగరి, నాగలాపురం, డక్కిలి, ఐరాల,
రామచంద్రాపురం, సదుం, యాదమరి, వరదయ్యపాళెం
బంగారుపాలెం, రొంపిచెర్ల, పూతలపట్టు, శాంతిపురం, గుడుపల్లె
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 9490952134